క్లుప్తంగా

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



గొర్రెలకు టీకాలు వేస్తున్న వైద్యులు

రాయికోడ్(అందోల్): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఇటికేపల్లిలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరచూ గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. తమ సూచనలు పాటించి పశు సంపదను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కృష్ణ, అమ్జద్, బసంతి, పోషకులు ఉన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కాలనీల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం అమలులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. పారిశుద్ధ్యంపై కాలనీ నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు తిలావత్, సంపత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ఇస్నాపూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం పటాన్‌చెరు షీ టీం ఇన్‌చార్జి ఎస్‌ఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు షీ టీం సేవలను వివరించారు. ఆకతాయిలు వెంటపడి వేధించడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తిస్తే డయల్ 100కు లేదా 7901148896కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం కానిస్టేబుల్ వీరమణి, తదితరులు పాల్గొన్నారు.

'సీఎస్ఆర్ నిధులతో చేసిన అభివృద్ధి ఎంత'

పటాన్‌చెరు: సీఎస్ఆర్ నిధులతో పటాన్‌చెరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఎంత అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ ప్రశ్నించారు. బుధవారం మండల పరిధిలోని ముత్తంగి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే కాకముందు ఎంత ఐటీ చెల్లించారు.. ప్రస్తుతం ఎంత చెల్లిస్తున్నావో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని శివనగర్ నుంచి చిన్నకంజర్ల గ్రామానికి వెళ్లే మార్గంలో ఎమ్మెల్యేకు సంబంధించిన క్రషర్ల నుంచి లారీలు తిరగడంతో రోడ్డు గుంతలుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, ఎస్ఆర్‌కె యువసేన నాయకులు రాజు, గోపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న సునీతా లక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం సునీత మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు హెల్త్ కార్డుల పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. అంతే కాకుండా జర్నలిస్టులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లతో పాటు హెల్త్ కార్డులు అందేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సునీతమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు శివశంకరరావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాజేందర్, పీఏసీఎస్ డైరెక్టర్లు రామచంద్రారెడ్డి, గొల్ల కృష్ణ, హోం న్యూరో సంగారెడ్డి ఆసుపత్రి ఎండీ. కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు వేళాయే..

- నేటి నుంచి మోతి మాత జాతర
- భారీగా తరలిరానున్న భక్తులు
- కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాట్లు పూర్తి

జహీరాబాద్ టౌన్: మినీ మేడారంగా చెప్పుకునే గిరిజనుల ఆరాధ్య దైవం మరిగమ్మ మోతి మాత జారత ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏడాది ఇదే సమయంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. రాష్ట్రంతో పాటు కర్నాటక, మహారాష్ట్రాల నుంచి సుమారు 2 లక్షలకు పైగా భక్తులు జాతరకు తరలివస్తుంటారు.

జిల్లాలోని మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లి శివారులో మరిగమ్మ మోతి మాత మందిరం ఉంది. అమ్మ తమ కోరికలను తీరుస్తుందని గిరిజనుల నమ్మకం. నూతన వధూవరులు, సంతానం లేని వారు ఇక్కడికి వచ్చి అమ్మను మొక్కుకుంటారు. మొక్కులు తీరిన తర్వాత అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీరుస్తారు. పెద్ద సంఖ్యలో గిరిజన పుత్రులు తరలిరావడంతో ఉప్పరపల్లి భక్త జనసందోహంగా మారుతుంది. మోతిమాత జాతరను ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఇటీవల కలెక్టర్ శరత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. అవసరమైన నిధులను మంజూరు చేయగా అధికారులు శరవేగంతో అభివృద్ధి పనులు నిర్వహించారు. భక్తులకు తాగు నీరు, పారిశుద్ధ్యం, కరెంట్, రవాణా తదితర ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. తాత్కాలిక మరుగు దొడ్లను నిర్మించగా ట్రాన్స్‌కో



ఉప్పర్‌పల్లిలో మరిగమ్మ మోతిమాత ఆలయం

అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చారు. తాగునీటి సౌకర్యం కూడా కల్పించారు. జహీరాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. రెండు, మూడు రోజులుగా అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, రాజర్షిషా, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఆర్డీఓ రమేశ్‌బాబు తదితరులు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.

6న మంత్రి హరీశ్‌రావు రాక

ఈ నెల 6వ తేదీన మోతిమాత జాతర ఉత్సవాలకు మంత్రి హరీశ్‌రావు, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, కలెక్టర్ శరత్, జెడ్పీ



పూజలు అందుకుంటున్న అమ్మవారు

చైర్‌పర్సన్ మంజుశ్రీ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు రానున్నారు. ఈమేరకు పోలీస్ అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థుల ప్రతిభకు 'తొలిమెట్టు'

జిల్లా నోడల్ అధికారి వెంకటేశం

కోహీర్(జహీరాబాద్): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి తొలిమెట్టు ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా నోడల్ అధికారి వెంకటేశం పేర్కొన్నారు. కోహీర్ పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన మండల స్థాయి బోధనా అభ్యసన సామగ్రి ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ అనుభవాన్ని రంగరించి తయారు చేసిన ఎగ్జిబిట్లు విద్యాబోధనకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితంతో పాటు పరిసరాల విజ్ఞాన శాస్త్రానికి సంబంధించి రెండేసి ఎగ్జిబిట్లను ఎంపిక చేసి జిల్లాస్థాయి ప్రదర్శనకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి అనురాధ, ఎంఈఓ శంకర్, మాజీ మండల ఉపాధ్యక్షుడు ఎస్‌కె. జావెద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోహీర్(జహీరాబాద్): ఎగ్జిబిట్లను తిలకిస్తున్న అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వాసర్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఎంపీపీ మహిపాల్ రెడ్డి మేళాను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ శంకర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ పాల్గొన్నారు.

ముగిసిన గాయత్రీ యజ్ఞం

కొల్చారం(నర్సాపూర్): మండలం రంగంపేటలోని ఆశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ గాయత్రీ యజ్ఞం బుధవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిసింది. నర్సాపూర్ డివిజన్ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆశ్రమ పీఠాధిపతి శ్రీ గురు మాధవానంద సరస్వతీ స్వామి పర్యవేక్షణ మధ్య ఈ యజ్ఞం చేపట్టారు. ఎమ్మెల్యే మదన్ రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీతారెడ్డి హాజరై స్వామి వారి ఆశీస్సులను పొందారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు హరిప్రసాద్ శర్మ, హరిక్రిష్ణ శర్మ, మాణిక్య శర్మ, కొల్చారం మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు మంజుల కాశీనాథ్, మెదక్ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ సావిత్రి రెడ్డి,



యజ్ఞంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌరిశంకర్ గుప్తా, ఎనగండ్ల సర్పంచ్ వీరారెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, బండి రమేశ్, శివాంజనేయులు, ప్రభులింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): సైన్స్‌తో పాటు అన్ని సబ్జెక్టులపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ సూచించారు. మండలంలోని గడ్డపోతారంలో 16 పాఠశాలలకు సంబంధించి బుధవారం టీఎల్ఎం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ రవీందర్‌గౌడ్ హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల చేత సైన్స్‌ఫెయిర్‌ను ఏర్పాటు చేయించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ రవీందర్‌గౌడ్, తదితరులు

యూజీడీ పనులు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని పదో వార్డు బీరప్ప బస్తీలో రూ. 10 లక్షలతో చేపట్టనున్న యూజీడీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి బుధవారం శంకుస్థాపన చేశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

సంక్షిప్త వార్తలు

◆ 8, 12 తేదీల్లో వివిధ పోటీలు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మిత్ర సోషల్ సర్వీస్ అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8, 12వ తేదీల్లో నారాయణఖేడ్‌లో వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. 8న స్థానిక వివేకానంద స్కూల్‌లో ముగ్గుల పోటీలు ఉంటాయని తెలిపారు. పాల్గొనేవారు 7989944667 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అదేరోజున జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో క్యారం, చెస్, షటిల్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

◆ కేలండర్, డైరీల ఆవిష్కరణ

నారాయణఖేడ్: రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్‌కు సంబంధించి 2023 నూతన సంవత్సర కేలండర్, డైరీలను నారాయణఖేడ్ ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ ఉద్యోగులు ఆవిష్కరించారు. జహీరాబాద్ డివిజన్ రెవిన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తారాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు ఈశ్వర్, రాజుపటేల్, చంద్రకళ, మాధవ రెడ్డి, ఈశ్వర్, అనిల్‌రెడ్డి, ఆర్డీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

◆ నూతన నియామకం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణానికి చెందిన ఇద్దరికి బీఎస్పీ మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిద్దు రావణ్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా అబార్ హుసేన్, మౌలాన షఫీలు నియమితులయ్యారని పేర్కొన్నారు. అలాగే జిల్లా కో కన్వీనర్‌గా జుబేర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు.

◆ నేడు భవానీ మాత యజ్ఞం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణ సమీపంలో హోతి(కె) పరిధిలో గల భవానీ మాత ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కుడంబల్ ఆయి తెలిపారు. బ్రహ్మశ్రీ గణపతి దీక్షిత్ మహారాజ్ సారథ్యంలో ఉదయం 11.55 గంటలకు భవానీ మాత యజ్ఞం జరుగుతుందన్నారు.

◆ స్కూటీ బహూకరణ

నారాయణఖేడ్: మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు హుక్రాన (జి) గ్రామానికి చెందిన నవాబ్‌కు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం స్కూటీని బహూకరించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీకి సేవలు అందిస్తుండడాన్ని గుర్తించి స్కూటీని బహూకరించారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

రాయికోడ్(అందోల్): మండలంలోని కర్చల్ గ్రామానికి చెందిన కల్పగురి రాజాగౌడ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజాగౌడ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో మాజీ సర్పంచ్ గంప చంద్రశేఖర్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బుధవారం రూ. 1.50 లక్షల ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

◆ నేడు బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం అందోల్‌లోని రామాలయంలో నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి బాబూమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ హాజరవుతారని తెలిపారు. అదే విధంగా ఈనెల 7వతేదీన బూత్ అధ్యక్షులతో వర్చువల్ మీటింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

◆ వాహనదారులకు ఇబ్బంది కలిగించొద్దు

సదాశివపేట(సంగారెడ్డి): ఆటోల్లో పెద్ద పెద్ద సౌండ్ బాక్స్‌లు పెట్టి ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించే ఆటో డ్రైవర్లకు జరిమానాలు విధిస్తామని ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మోమిన్‌పేట రోడ్డులో పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగలక్ష్మి, ఏఎస్‌ఐలు చంద్రయ్య, ఖుత్‌బుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి . బుధవారం 38 మందికి ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించగా అందరికీ నెగెటివ్‌గా నిర్ధారణ అయినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అదేవిధంగా 37 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే క్రాంతికిరణ్



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రాంతికిరణ్

జోగిపట(అందోల్): సీఎం కేసీఆర్‌ను అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం కేసీఆర్ అడిగి తెలుసుకున్నారని తెలిపారు. రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేశామని పనులు చేయించుకోవాలని సూచించారు. అలాగే సంగమేశ్వర బసవేశ్వర లిఫ్ట్ పనులు త్వరలో మొదలుపెట్టాలన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో మరో సోషల్ వెల్ఫేర్ కాలేజీ మంజూరు చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు.

బాధ్యతల స్వీకరణ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్‌గా జేబా షహమీమ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కొంత కాలంగా డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండడంతో జేబా షహమీమ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధుల్లో చేరిన డాక్టర్‌ను ఆస్పత్రి సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ: ప్రజలకు వినోదాన్ని ఇచ్చే ఎగ్జిబిషన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి బుధవారం రాత్రి పట్టణంలోని సితార గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి ఎగ్జిబిషన్స్ అప్పుడప్పుడు ఏర్పాటు చేస్తే ప్రజలు వినోదంతో పాటు ఆనందాన్ని పొందుతారని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షఫీ, యాకూబ్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు కావడం లేదన్నారు. పేద ఆడపిల్లల పెళ్లికి సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ప్రతిపక్షాలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గుర్తుకు రావడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, టీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ఎంజీ. రాములు, మొహినోద్దీన్, బీఆర్ఎస్ నాయకులు మంకాల్‌సుభాశ్, వైజ్యనాథ్, రాములునేత, ఇజ్రాయిల్ బాబీ, యూనూస్, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

పంట రక్షణకు పాలిథిన్ కవర్లు

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో రైతులు సాగు చేసుకున్న పంటలను రక్షించుకునేందుకు వినూత్న పద్ధతులు అవలంభిస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న, జొన్న, కంది తదితర పంటలు సాగు చేస్తున్నారు. ఈ పంటలను ముఖ్యంగా పక్షులతో పాటు అడవి పందులు ధ్వంసం చేస్తున్నారు. ఈక్రమంలో ఝరాసంగం-జహీరాబాద్ ప్రధాన రహదారి పక్కన మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో మొక్కజొన్న సాగు చేస్తున్న రైతు వినూత్నంగా సరికొత్త ఆలోచన చేశాడు. పాలిథిన్ కవర్లతో కట్టెలను ఉపయోగించి పంట మొత్తం ఏర్పాటు చేశారు. ఈవిధంగా కొంత మేర పంటలను రక్షించుకుంటున్నారు.



పొలంలో ఏర్పాటు చేసిన పాలిథిన్ కవర్లు

విద్యార్థులు కష్టపడి చదవాలి



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

నారాయణఖేడ్: విద్యార్థులు కష్టపడి చదవాలని ఎంపీపీ చాందీబాయి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ర రమేశ్ చౌహాన్ సూచించారు. మండలంలోని ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు రమేశ్ చౌహాన్ సొంత ఖర్చులతో బుధవారం నుంచి అల్పాహారం పంపిణీని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారన్న విషయాన్ని విద్యార్థులు గుర్తుంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, కలెక్టర్ శరత్ సూచనల మేరకు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు విద్యా సంవత్సరం ముగిసే వరకు అల్పాహారం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బీదర్‌లో బీఆర్ఎస్‌కు మంచి స్పందన

నారాయణఖేడ్: కర్ణాటకలోని బీదర్ జిల్లాలో బీఆర్ఎస్‌కు మంచి స్పందన లభిస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బీదర్‌కు చెందిన ఏక్తా ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్‌స్వామిని బీదర్‌లో మంగళవారం రాత్రి కలిసి బీఆర్ఎస్‌లో చేరాలని ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న పథకాల పట్ల కర్ణాటకవాసులు ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. గతంలో వేసవిలో కర్ణాటకలోని జంగి ప్రాంతవాసులు అక్కడ తీవ్ర నీటి ఎద్దడి ఉండగా మన రాష్ట్రంలోని నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తికి వచ్చి మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటిని తీసుకెళ్లి దాహార్తిని తీర్చుకున్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు రోషన్‌రెడ్డి, సుదర్శన్ పాటిల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఆధార్ అనుసంధానం చేయాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీల ఆధార్‌ను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయాలని ఎంపీడీఓ సుజాత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆధార్ లింక్‌ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా హరితహారంలో మొక్కలు నాటేందుకు నర్సరీలో సిద్ధంగా ఉంచాలన్నారు. కూలీలకు పని కల్పించి, కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ రాజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



న్యాల్‌కల్(జహీరాబాద్): సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వినయ్‌కుమార్



పటాన్‌చెరు టౌన్: కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రసాద్‌రావు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. లాటరీ, కేవైసీ, ఉద్యోగాలు, రుణయాప్‌లు, ఓటీపీ, హనీట్రాప్ తదితర వాటి పేరిట సైబర్ నేరస్తులు చేసే మోసాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హద్నూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు ఎవరు స్పందించవద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లో చెప్పవద్దన్నారు. అలాగే మోటార్ వాహన చట్టం, బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం, హెడ్ కానిస్టేబుల్ సంజీవ్, పోలీసులు సంగమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అవగాహన

పటాన్‌చెరు టౌన్: చాలా వరకు చదువుకున్న వారే సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పటాన్‌చెరు ఎస్‌ఐ ప్రసాద్‌రావు సూచించారు. బుధవారం చిట్కుల్ గ్రామంలోని జీటీఎస్ పరిశ్రమలో కార్మికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.